ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
ఆదివారం 26 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ :18004251442
యాదాద్రి :1800 425 7106
సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 16.0

జన.. ఘున.. మననం



- నిత్యం జాతీయ గీతాలాపన
- ఉదయం 8.30 గంటలకు కూడళ్లలోని మైకుల్లో
- నాలుగేళ్ల కిందట నల్లగొండలో ప్రారంభం
- కొన్నాళ్లుగా నార్కట్‌పల్లి, తిప్పర్తి, త్రిపురారంలోనూ..
- స్ఫూర్తిగా నిలిచిన కార్యక్రమం
- స్థానికుల ప్రోత్సాహంతో విజయవంతం

చాలామంది బాల్యంలో పంద్రాగస్టు, రిపబ్లిక్‌డే సందర్భంగా జాతీయ గీతాలాపన చేసి వందనం చేసి ఉంటారు. కానీ, నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాత్రం నిత్యం జాతీయగీతాలాపన చేస్తుంటారు. అదీనూ ఒకే సమయంలో.. ప్రజల్లో జాతీయతను పెంపొందించేందుకు జనగణమన కమిటీలు ఏర్పాటు చేసుకుని కూడళ్లలో జాతీయ గీతాన్ని వినిపిస్తున్నారు. ఇలా నాలుగేళ్ల కిందట నల్లగొండ జిల్లా కేంద్రంలోని 12 కూడళ్లలో మొదలైన ఈ కార్యక్రమం మరో మూడు మండల కేంద్రాల్లో చేపట్టేందుకు స్ఫూర్తిగా నిలిచింది. ప్రస్తుతం ఈ నాలుగు మండలాల్లో ఉదయం 8.30గంటలకు జనగణమన మైకుల్లో మార్మోగుతోంది. కూడళ్లలోని మైకుల ద్వారా గీతాలాపన జరుగుతుండగా, సమీపంలోని వ్యాపారులు, వృద్ధులు, ప్రయాణికులు ఎక్కడి వారక్కడ నిల్చుని వందన సమర్పణ చేస్తున్నారు. ఇలా నిత్యం జనగణమనను కొన్నాళ్లుగా మననం చేసుకుంటున్నారు.

• 6లో..



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో జనగణమన ఆలాపన చేస్తున్న జనగణమన కమిటీ సభ్యులు



పెద్దగట్టు ఆలయం

పెద్దగట్టుపై చిన్నచూపు

రాష్ట్రంలో సమ్మక్క సారక్క తర్వాత పెద్దగట్టు జాతర (లింగమంతుల స్వామి) అతిపెద్దది. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు సుమారు 10లక్షల మందికిపైగా భక్తులు వస్తుంటారు. ఇంతటి ప్రజాసమూహం సందర్శించే పెద్దగట్టు జాతర నిర్వహణపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్న విమర్శలు భక్తుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్లకోసారి నిర్వహించే జాతరకు అప్పటికప్పుడు నిధులు విడుదల చేయడం, ఆయా నిధులతో తాత్కాలిక పనులు చేపట్టడం వంటి తీరును భక్తులు ఉదాహరణగా పేర్కొంటున్నారు. ప్రభుత్వంలోని 11 శాఖల నడుమ సమన్వయంతో చేపట్టాల్సిన ఏర్పాట్లను దేవాదాయ, మునిసిపల్ శాఖలే సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, సూర్యాపేట

- సమ్మక్కసారక్క తర్వాత పెద్దజాతర
- రెండేళ్లకోసారి జాతర, అయినా నిధుల విడుదలలో జాప్యం
- 21 రోజులే గడువు.. ఇంకా పూర్తిస్థాయిలో చేపట్టని జాతర పనులు
- ప్రతీ పర్యాయం తాత్కాలిక ఏర్పాట్లే
- 10లక్షల మంది పాల్గొనే జాతర

పెద్దగట్టు ఆలయం సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోకి వస్తుంది. పెద్దగట్టుపైన దేవాదాయ శాఖ, గుట్ట కింద మునిసిపాలిటీ శాఖలు భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అయితే ప్రతీ జాతరలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎవరి పరిధిలో వారు పనులు చేసుకుంటున్నారు. నిధుల వినియోగంలో సమన్వయం లేదని గత పాలకవర్గాలు ఆరోపిస్తున్నాయి. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ప్రజా ప్రతినిధులు, అధికారులు పెట్టుకుంటున్నారే తప్ప ప్రత్యక్షంగా జాతర ఏర్పాట్లపై ఇంతవరకు సమీక్ష నిర్వహించలేదు. మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపులో ఆలస్యంతో ఆదరాబాదరాగా పనులు చేపడుతున్నారు.

21 రోజుల్లో జాతర

పెద్దగట్టు జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ పర్యాయం జాతరకు ఇంకా 22 రోజుల సమయం మాత్రమే ఉంది. ఫిబ్రవరి 2న దిష్టిపూజతో లింగమంతుల పండుగ వాతావరణం నెలకొంటుంది. అప్పటినుంచి భక్తుల రాకపోకలు జరుగుతాయి. నిధులు మంజూరుకాకపోవడవంతో ఇంతవరకూ జాతర పనులు మొదలు కాలేదు. వివిధ శాఖల నుంచి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలుస్తోంది. ఒక్క శాఖకు కూడా ఇంతవరకు నిధులు కేటాయింపు జరగలేదని సమాచారం. పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, ఇతర శాఖలకు నిధులు కేటాయిస్తే పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానిస్తూ అధికారులు పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు ఆ ప్రక్రియ చేపట్టలేదు. దీంతో ఆయా ప్రధాన శాఖల అధికారులకు దిగులు పట్టుకుంది. ఎప్పుడు ప్రకటించి, ఎప్పుడు పనులు చేపట్టాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా చెరువులో నీరు ఉండటంతో గుట్టకు దూరంలో 70ఎకరాలను లీజుకు తీసుకున్నారు. అక్కడ సౌకర్యాలు కల్పించడానికి అధికారులు సమయం సరిపోదంటున్నారు. త్వరగా నిధులు కేటాయిస్తేనే పనులు చేసే అవకాశం ఉంటుందని కొంతమంది అధికారులు తెలిపారు.



పెద్దగట్టు వద్ద నిరుపయోగంగా ఉన్న మంచినీటి కుళాయిలు

శాశ్వత నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరాం



లింగమంతులస్వామి (పెద్దగట్టు)పై భాగంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టడానికి రూ.4.50కోట్ల నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించాం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఆయన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేలా చూస్తానన్నారు. భక్తుల కోసం షెడ్ నిర్మాణం చేయాలని, మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తాం.

పోలెబోయిన నర్సయ్యయాదవ్, లింగమంతుల దేవస్థానం చైర్మన్

శాశ్వత పనులేవీ?

గుట్టపైన శాశ్వత పనులను పూర్తిస్థాయిలో చేపట్టలేదు. గుట్టపైకి వచ్చే భక్తులకు కొంతమేర

మిగతా 6వ పేజీలో...

పేదల కోసమే సంక్షేమ పథకాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి, పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు

- ప్రతీ మండలంలోని ఓ గ్రామంలో ప్రభుత్వ పథకాలు ప్రారంభించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

భువనగిరి (కలెక్టరేట్), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసమే గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు పథకాలను ప్రభుత్వం ప్రారంభిస్తోందని, ప్రతీ మండలంలోని ఓ గ్రామంలో ఈ పథకాలను ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. 250 నుంచి 400 ఇళ్ల గ్రామాలను ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఎంచుకొని గ్రామాల జాబితా, నాలుగు పథకాల లబ్ధిదారుల జాబితా పంపాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో పథకాలను ప్రారంభించాలన్నారు. ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి పథకాల మంజూరు పత్రాలను అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.హనుమంతరావు, అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకాల ప్రారంభపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

(ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్): అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీచేశారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో నవీన్‌కుమార్, ఎంపీవో సలీం, డీటీ నరసింహారావు, తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్య ఆయుధం : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్): ఓటు హక్కు ప్రజాస్వామ్య ఆయుధమని, దేశ భవిష్యత్తు కోసం ప్రతీ ఒక్కరు అన్ని ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఓటు నమోదు నిరంతర ప్రక్రియ అని, 18 ఏళ్లు నిండిన వారందరూ ఆన్‌లైన్‌లో లేదా బీఎల్‌వోల వద్ద ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటు వేయడం బాధ్యతగా పరిగణించాలని, ఓటువేసి నచ్చిన ప్రభుత్వాన్ని, పాలకులను ఎన్నుకోవాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోగలిగితేనే ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడినట్టేన్నారు. అనంతరం నిర్వహించిన ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఉత్తమ బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బందికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, మునిసిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్డీవో కృష్ణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ పి.రామాంజుల రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి కె.ధనాంజనేయులు, ఎంపీడీవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకులకు సన్నద్ధం



గణతంత్ర ఏర్పాట్లు చేసిన సిబ్బంది

భువనగిరి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మైదానాన్ని చదను చేసి బారికేడింగ్ ఏర్పాటు చేశారు. వేదిక, స్టాళ్లు నిర్మించారు. పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. పోలీసులు పరేడ్ ప్రాక్టీస్ చేశారు. బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేశాయి. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలను ప్రదర్శించనున్నారు. కలెక్టర్ ఎం.హనుమంతరావు జాతీయ జెండా ఎగుర వేస్తారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, చౌరాస్తాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, ఆర్డీవో కృష్ణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ పి.రామాంజులరెడ్డి తదితర అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాన్ బ్రోకర్లపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి (కలెక్టరేట్), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న పాన్ బ్రోకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ పార్టీ మండల అధ్యక్షుడు కల్లేపల్లి మహేందర్ అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఏవో జగన్‌మోహన్ ప్రసాద్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు మార్వాడీలు పాన్ బ్రోకర్ల పేరుతో అధిక వడ్డీలతో వ్యాపారం నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. యాదగిరిగుట్టలో మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బండి జంగమ్మ, పెంటయ్య, మహేందర్, రాజు పాల్గొన్నారు.





నిరసనలో పాల్గొన్న ఎంపీ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, భారికేడ్లను తొలగిస్తున్న నాయకులు



కలెక్టరేట్ వద్ద కంచె వేసిన పోలీసులు

క్షణ క్షణం.. ఉత్కంఠ

- త్రిపుల్‌ఆర్ బాధితుల కలెక్టరేట్ మహా ధర్నా
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల మద్దతు

భువనగిరి అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): త్రిపుల్ ఆర్ రైతుల కలెక్టరేట్ మహాధర్నా క్షణ క్షణం ఉత్కంఠగా మారింది. పోలీసుల పరుగులు... నిరసకారుల ఉరుకులు.. పెద్ద ఎత్తున నినాదాలతో కలెక్టరేట్ పరిసరాలు హోరెత్తాయి. భువనగిరి డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర నేతృత్వంలో భారీగా మోహరించిన పోలీసులతో నిరసనకారులను అడ్డుకోగలిగారు. మా భూమికి భూమి ఇవ్వాలి.. లేదంటే ప్రైవేట్ మార్కెట్ ధర చెల్లించాలని, దక్షిణ భాగంలో అలైన్‌మెంట్ మార్చాలనే డిమాండ్‌తో త్రిపుల్ ఆర్ రైతులు శనివారం కలెక్టరేట్ మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ మేరకు అనుమతి లేదని డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర నిరాకరించడంతో వివిధ రూపాల్లో చౌటుప్పల్, రాయిగిరికి చెందిన త్రిపుల్ ఆర్ రైతులు నిరసనలు తెలిపేందుకు సిద్ధం కాగా వీరికి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు మద్దతు తెలిపాయి. ఆందోళనకు బీజేపీ, బీఆర్‌ఎస్ మద్దతు పలుకగా నిరసనలు నేపథ్యంలో పోలీసులు, ఇరు పార్టీల శ్రేణుల మధ్య తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కలెక్టరేట్ వద్ద అనుమతి లేనందున భూ నిర్వాసితులు ఏర్పాటు చేసుకున్న టెంట్ కుర్చీలు ఉదయమే పోలీసులు తొలగించారు. ముట్టడికి అనుమతి లేదని డీసీపీ తెలిపారు. 2023లో మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డి పర్యటనలో సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తుగా భారీగా పోలీసులు బలగాలు మోహరించాయి. కలెక్టరేట్ రోడ్డుకిరువైపుల వాహనాలను అనుమతించక పోలీసుల ఆధీనంలోకి తీసుకొని ట్రాఫిక్ మళ్లించారు. జాతీయ రహదారిపై నుంచి ఎంపీ కే.లక్ష్మణ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్‌తో బీజేపీ శ్రేణులు కలెక్టరేట్ చేరుకునే సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. ఇంతలోనే భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులతో ప్రభుత్వం, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌లోకి అనుమతించపోవడం చేత ఒక్కసారిగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. డివైడర్‌కు ఇరువైపుల రెండు పార్టీల వేర్వేరుగా కార్యకర్తలు, రైతులతో ఆ ప్రాంతమంత దద్దరిల్లిపోయింది.

రైతులతకు మద్దతుగా ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

ఎంపీ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల పార్టీ శ్రేణులతో రైతులకు మద్దతుగా బైఠాయించారు. ఇదే సమయంలో బీఆర్‌ఎస్ శ్రేణులు కలెక్టరేట్‌లోని అనుమతించకపోవడంతో పక్కనే ఉన్న 163జాతీయ రహదారిపై సుమారు 15నిమిషాలు ధర్నాకు దిగారు. పోలీసులు సముదాయించే ప్రయత్నం చేయగా ఎంతకి శాంతించని నిరసనకారులను అరెస్టు చేసి వాహనంలో తరలించే సమయంలో తోపులాట జరిగింది. మాజీ ఎమ్మెల్యే పైళ్ల మరికొంతమందితో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసేందుకు లోనికి వెళ్లేటప్పుడు పోలీసులు, నిరసనకారులకు తోపులాట జరిగింది. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసేందుకు బీజేపీ ఎంపీ లక్ష్మణ్, పాశం భాస్కర్, కాసం వెంకటేశ్వర్లతో కలెక్టరేట్‌లోకి వెళ్లగా అరగంట తర్వాత మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, క్యామ మల్లేష్ వెళ్లేందుకు పోలీసులు నిరాకరించారు. అక్కడే ఉన్న డీసీపీ ఆదేశాల మేరకు ముందుగా పైళ్ల, క్యామ మల్లేష్‌ను లోనికి అనుమతించారు. అక్కడ కలెక్టర్ లేకపోవడంతో అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర నాయకులు గొంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, గూడూరు నారాయణరెడ్డి, పడమటి జగన్మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, బీఆర్‌ఎస్ జిల్లా కంచర్ల రామక్రిష్ణారెడ్డి, క్యామ మల్లేష్, ఎనబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, జనగాం పాండు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చౌటుప్పల్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రానన్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు. చౌటుప్పల్ పట్టణంలోని గాంధీ పార్క్‌లో శనివారం గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీజీ జ్ఞాన్ ప్రతిష్టాన్‌ల ఆధ్వర్యంలో గాంధీజీ సుస్థిర విజ్ఞాన్ సదస్సు నిర్వహించారు. 500మంది విద్యార్థులు గాంధీజీ వేషధారణతో అలరించగా, 601 గాంధీజీ విగ్రహాలను ఏర్పాటు చేసి సభికులను ఆకట్టుకున్నారు. ఐదు సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలంతోపాటు కౌన్సిలర్లను రాజగోపాల్ రెడ్డి సన్మానించి, అభినందించారు. గాంధీ టోపిని ధరించి చరఖాను తిప్పారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, గత పాలకుల నిర్లక్ష్యంతో నియోజకవర్గంలో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గాంధీ చూపించిన అహింసామార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ అధ్యక్షుడు గున్నా రాజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ సమన్వయ కర్త పబ్బు రాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్, మాజీ అధ్యక్షుడు మొగుదాల రమేష్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, ట్రీనిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు పాల్గొన్నారు. చౌటుప్పల్ పట్టణంలో ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్ర బోస్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు.



గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

జన.. ఘన.. మననం

● నల్లగొండలో నాలుగేళ్లుగా నిత్యం జాతీయ గీతాలాపన ● 12 కూడళ్లలో నిర్వహణ

అదో అద్భుతమైన దేశభక్తి కార్యక్రమం. ఉదయం 8.30 అయిందంటే చాలు నిత్యం కూడళ్లలో జనగణమన వినిపిస్తుంటుంది. మైకుల్లో జాతీయ గీతం ప్రారంభమైన వెంటనే ఎక్కడి వారు అక్కడ నిలబడి జాతీయజెండాకు మనస్ఫూర్తిగా నమస్కరిస్తుంటారు. పలు కూడళ్లల్లో గీతాలాపన ప్రారంభానికి ముందు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో పాటు అక్కడి చిరువ్యాపారులు, ఉద్యోగులు, సైకిళ్లపై స్కూల్‌కు వెళ్లే చిన్నారులు అక్కడే ఆగి సెల్యూట్ చేయడం అద్భుతంగా కనిపించే సన్నివేశం. ఇలాంటి గీతాలాపనతో ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందిస్తున్నారు. కొన్నాళ్లుగా జిల్లా కేంద్రమైన నల్లగొండ పట్టణంలోని 12 కూడళ్లతో పాటు నార్కట్‌పల్లి, తిప్పర్తి, త్రిపురారం మండలాల్లోనూ ఈ నిత్యజనగణమన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టినరోజును పురస్కరించుకొని 2021 సంవత్సరం జనవరి 23న నల్లగొండలో జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిత్య జాతీయ గీతాలపన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతిరోజూ ఉదయం 8.08 గంటలకు ముఖ్యకూడళ్ల వద్ద ఉన్న మైకుల్లో దేశభక్తి పాటలు మారుమోగుతుంటాయి. సరిగ్గా 8.29 గంటలకు జాతీయ గీతం ప్రారంభమవుతుంది. ఆ సమయంలో 52 సెకన్ల పాటు జాతీయ గీతాలాపన వచ్చినంతా సేపు ఆయా కూడళ్లలోని ప్రజలంతా జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తారు. యువతలో దేశభక్తి పెంపొందించాలనే సంకల్పంతో జనగణమన ఉత్సవ సమితి ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా అంతటికి విస్తరింప చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థులు, యువతలో జాతీయ భావాలను, దేశభక్తిని పెంపొందిచాలనే సంకల్పంతో ఈ గీతాలపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో దానికి సంబంధించిన పరికరాలు ఏర్పాటుచేసి మైక్ సిస్టమ్‌లకు కేబుల్ ద్వారా ఏకకాలంలో దేశభక్తి పాటలు, జనగణమన జాతీయం గీతం వచ్చేలా ఏర్పాటు చేశారు.



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో జాతీయ గీతాలాపన సమయంలో నిలిచిన వాహనాలు, సెల్యూట్ చేస్తున్న పాదాచారులు, ట్రాఫిక్ కానిస్టేబుల్, ప్రజలు

జనగణమన పాడుదాం.. దేశభక్తి చాటుదాం

కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో జరుగుతున్న నిత్య గీతాలాపనను స్ఫూర్తిగా తీసుకొని నల్లగొండలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సమాచారం. 'దేశం కోసం ఒక నిమిషం' అన్న సందేశంతో ప్రతి నిత్యం జాతీయ గీతాలాపన సాగుతోంది. అన్నివర్గాల ప్రజల్లో దేశభక్తిని పెంచాలన్నా ఉద్దేశ్యంతో 'జనగణమన పాడుదాం, దేశభక్తిని చాటుదాం' అంటూ జనగణమన ఉత్సవ సమితి నిత్య గీతాలాపనకు అంకుర్పారణ చేశారు. నిత్య జాతీయ గీతాలాపనకు ప్రారంభమే కాని చివరి రోజు ఉండవద్దనే ఉద్దేశ్యంతో నేతాజీ జయంతి అయిన జనవరి 2021 జనవరి 23వ తేదీన ప్రారంభించి కొనసాగిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు నల్లగొండలో ప్రతి నిత్యం క్రమం తప్పకుండా కొనసాగిస్తుండగా ఆ తరువాత మొదలైన నార్కట్‌పల్లి, తిప్పర్తి, త్రిపురారంలో సైతం ఈ కార్యక్రమం కొనసాగుతోంది. గతంలో కరోనా సమయంలో దేశభక్తి గీతాలతో పాటు కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ పలు సూచనలు కూడా వినిపించి అవగాహన కల్పించారు.

● దేశభక్తి, క్రమశిక్షణ పెరగాలన్నదే లక్ష్యం



కర్నాటి విజయ్ కుమార్
జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు

విద్యార్థులు, యువతతో పాటు అన్నివర్గాల్లో దేశభక్తి, క్రమశిక్షణ ఉండాలన్నా లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని పెంచాలని 'దేశం కోసం ఒక్క నిమిషం' అంటూ కార్యక్రమం చేపట్టాం. అందరూ పాల్గొనడం సంతోషాన్ని కలిగిస్తోంది. జిల్లాలో విస్తరింపచేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

(ఆంధ్ర జ్యోతి-నార్కట్‌పల్లి)

నార్కట్‌పల్లి పట్టణంలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం మూడేళ్లుగా కొనసాగుతోంది. నేటి యువతలో దేశభక్తిని, జాతీయ భావాన్ని మరింత పెంచే లక్ష్యంతో జగిత్యాల, నల్లగొండ, తిప్పర్తి తదితర పట్టణాల్లో కొన్నేళ్ల కిందటే జనగణమన కమిటీల ఆధ్వర్యంలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం ప్రారంభమై నిర్విరామంగా కొనసాగుతోంది. ఈ విషయాన్ని ఆయా మార్గాల ద్వారా స్ఫూర్తి పొందిన కొందరు యువకులు నార్కట్‌పల్లి పట్టణంలోనూ నిత్య జాతీయ గీతాలాపనను ప్రారంభించాలని సంకల్పించారు. నల్లగొండలో ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్న కర్నాటి విజయ్‌కుమార్ బృందాన్ని సంప్రదించారు. అక్కడ నిర్వహిస్తున్న విధానాన్ని తెలుసుకుని 2022 ఆగస్టు 15న ఘనంగా ప్రారంభించి తమ సంకల్పానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆర్థిక, హార్థిక సహకారంతో మైకు సెట్‌లను ఏర్పాటుచేశారు. తొలుత పట్టణంలోని నాలుగు కూడళ్లలో నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. నల్లగొండ క్రాస్ రోడ్డు, బస్టాండ్, అమ్మనబోలు క్రాస్ రోడ్డు, మునుగోడు క్రాస్ రోడ్డు వద్ద ప్రతీ రోజూ ఉదయం 8.30 గంటలకు జాతీయ గీతాలాపనను విజయవంతం చేశారు. అంతకు ముందు దేశభక్తిని, స్వాతంత్ర్యోద్యమ త్యాగమూర్తులను గుర్తుచేస్తూ సాగే పాటలు వినిపిస్తాయి. అనంతరం 52 సెకన్ల నిడివిలో ఉండే జనగణమన జాతీయ గీతాలాపన అనంతరం జాతీయ గీతానికి వందన సమర్పణతో కార్యక్రమం ముగిస్తున్నారు. 2023 ఆగస్టు 15న మొదటి వార్షికోత్సవ వేడుకలను నార్కట్‌పల్లిలో ఆడంబరంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో ఆటంకం ఏర్పడి ఆరు నెలల పాటు నిలిపివేసిన ఈ నిత్య జాతీయ గీతాలాపన సంక్రాంతి నుంచి ప్రస్తుతం నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద పునఃప్రారంభమైంది. వయస్సు తారతమ్యం లేకుండా గీతాలాపన సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని నిర్వహకులను అభినందిస్తున్నారు.



నార్కట్‌పల్లిలోని నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద నిత్య జాతీయ గీతాలాపనలో పాల్గొన్న పౌరులు

నల్లగొండ స్ఫూర్తితో..

జాతీయభావం పెంపొందించాలనే



కన్నెబోయిన నర్సింహ
జనగణమన కమిటీ అధ్యక్షుడు, నార్కట్‌పల్లి

నేటి తరంలో జాతీయ భావం పెంపొందించే సదాశయంతోనే నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి సంకల్పించాం. దేశభక్తి, జాతీయత కేవలం జాతీయ పండుగల రోజు మాత్రమే ప్రస్తావనకు వస్తుండగా తదుపరి ఆ ఊసే ఉండటం లేదు. దీంతో నిత్యగీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టాం. స్వాతంత్ర్య వీరులను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నాం.

పౌరుడిగా కర్తవ్యంగా భావిస్తున్న..



బండారు రమేష్
స్థానిక వ్యాపారి

నార్కట్‌పల్లిలో ప్రతి రోజూ నిర్వహించే నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి హాజరవుతున్నా. దేశభక్తిని, జాతీయభావాన్ని పెంపొందించే ఈ కార్యక్రమంలో పాల్గొనడం పౌరుడిగా నా కర్తవ్యంగా భావిస్తున్న. ఇలా అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తే నేటి తరంలో జాతీయ భావం దానంతటదే ప్రేరేపిస్తుంది. ఒక్క నిమిషం జాతీయ గీతాలాపనకు వీలైనంత మేరకు ప్రజలు సమయమివ్వాలి.

ప్రజల భాగస్వామ్యంతోనే నాలుగేళ్లు పూర్తి



నిత్యజాతీయ గీతాలాపన కార్యక్రమానికి నాలుగేళ్లు పూర్తయ్యాయి. నేటి వరకు నిర్విరామంగా కార్యక్రమం కొనసాగడం సంతోషకరం. ఉత్సవ సమితితో పాటు ప్రజల భాగస్వామ్యంతో ఇది సాధ్యమైంది. ఈ గీతాలాపనతో జాతీయ గీతంపై భక్తి పెరిగింది.

దోసపాటి శ్రీనివాస్, సహా అధ్యక్షుడు జనగణమన ఉత్సవ సమితి

ప్రజల నుంచి అపూర్వ స్పందన



నిత్యజాతీయ గీతాలాపన కార్యక్రమానికి ప్రజలు, యువత నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది. చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. గీతాలాపన ప్రారంభ సమయంలో పాదాచారులతో పాటు వాహనదారులు సైతం స్వీయ క్రమశిక్షణతో నిలబడి జాతీయగీతం ఆలపిస్తున్నారు.

కొలనుపాక రవికుమార్, జనగణమన ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు పోచంపల్లి

చేనేత కళాకారులకు అవకాశం



గణతంత్ర వేడుకలకు హాజరయ్యేందుకు ఢిల్లీకి చేరుకున్న తెలంగాణ నుంచి ఎంపికైన చేనేత కళాకారులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ రాజధాని ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఈ నెల 26న నిర్వహించే వేడుకలకు రాష్ట్రం నుంచి పలువురు చేనేత కళాకారులకు పాల్గొనే అవకాశం దక్కింది. అందులో యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి నుంచి చేనేత అవార్డు గ్రహీతలు ఎన్నం మాధవి శివకుమార్, తడక రమేష్, పుట్టపాక నుంచి రాపోలు బాలసుబ్రహ్మణ్యం, సిద్దిపేట నుంచి ఎస్ యశ్వంత్ తదితరులు ఆహ్వానం పొందారు. ఈ మేరకు వారు శనివారమే ఢిల్లీకి చేరుకున్నారు. హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ డిపార్టుమెంట్ నిర్వహించే కార్యక్రమాల్లో వారు పాల్గొంటారు.

రూ.కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడి..

● ఆక్రమణలను అడ్డుకుంటున్న తహసీల్దార్ హరిబాబు
● మిర్యాలగూడ మండలంలో ఆక్రమిత ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ హరిబాబు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్)

ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటే చూద్దాంలే అనే అధికారులను చూస్తున్న ప్రస్తుత సమాజంలో కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని వెంటబడి కాపాడిన అధికారి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబు. మిర్యాలగూడ మండలంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడటంలో హరిబాబు తీవ్రంగా శ్రమించారు. సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆధ్వర్యంలో ఎనిమిది స్థలాలను ప్రభుత్వ భూములుగా గుర్తించారు. ఎకరం రూ.5కోట్ల విలువ కలిగిన పట్టణ నడిబొడ్డులో ఉన్న మూడు ఎకరాలు, ఆలగడపలో రూ.40లక్షల విలువ గల భూమిని, తడమకళ్ల, ఇందిరమ్మ కాలనీలో, జప్తివీరప్పగూడెం, వెంకటాద్రిపాలెం తదితర గ్రామాల్లో లక్షల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టారు. 2023లో మిర్యాలగూడ తహసీల్దార్‌గా వచ్చిన హరిబాబు పనితీరు ఇతర అధికారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

ఎన్నికల వేళ అన్నీ తానై...

ఇటీవల వరుస ఎన్నికలను అందరినీ సమన్వయం చేసుకుంటూ సజావుగా జరిగేలా చూసిన హరిబాబు పనితీరును ఉన్నతాధికారులు గుర్తించి అభినందించారు. ధరణి సమస్యలపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన సమయాన్ని పూర్తిగా కేటాయిస్తూ 6,300 భూసమస్యలను పరిష్కరించారు. ఉదయం ఎనిమిది గంటలకే విధుల్లోకి హాజరవుతుంటారు. సాయంత్రం 7గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న హరిబాబు 2007లో జూనియర్ అసిస్టెంట్‌గా మహబూబ్‌నగర్ జిల్లా తాడూరులో పనిచేశారు. 2012లో మహబూబ్‌నగర్ కలెక్టరేట్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సీఎస్‌గా తన విధులను నిర్వర్తించారు.



నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి నుంచి అవార్డును అందుకుంటున్న హరిబాబు

● తహసీల్దార్ హరిబాబుకు ఉత్తమ అవార్డు

ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువంటి రిమార్కులు లేకుండా పనిచేసినందుకు మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబుకు ఉత్తమ తహసీల్దార్ అవార్డును కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిబాబు మాట్లాడుతూ మండల పరిధిలో సిబ్బంది, అన్ని పక్షాల నాయకుల సహకారంతో ఎన్నికలను ఎలాంటి విభేదాలు లేకుండా నిర్వహించడం జరిగిందన్నారు. తన పనితనాన్ని గుర్తించి కలెక్టర్ ఇలా త్రిపాఠి తనకు ఉత్తమ తహసీల్దార్ అవార్డును అందించడం ఆనందంగా ఉందన్నారు.

పెద్దగట్టుపై చిన్నచూపు



పెద్దగట్టుపై మరుగుదొడ్ల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

(5వ పేజీ తరువాయి)

మరుగుదొడ్లు నిర్మించారు. జాతర సమయంలో తాత్కాలికంగా ఏర్పాటుచేసి నిధులను వృథా చేస్తున్నారు. గుట్టపైన ఉత్తరం, దక్షిణం వైపు మరుగుదొడ్లు నిర్మించాలని భావించినా నిధులు లేక అడుగు ముందుకు పడడం లేదు. భక్తులు సేద తీరడానికి పెద్ద షెడ్ నిర్మాణం చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆచరణలోకి రాలేదు. గుడి చుట్టూ భక్తులు తిరగడానికి ఏర్పాటు చేసే చలువ పందిళ్ల కిందనే భక్తులు సేద తీరాల్సి వస్తోంది. వీటికి తోడు అక్కడక్కడ షామియానాలు ఏర్పాటుచేస్తున్నారు. వీటికి పెట్టే ఖర్చుకు తోడు కొంత ప్రభుత్వం నిధులు కేటాయిస్తే శాశ్వతంగా ఉండే షెడ్ నిర్మాణం చేయవచ్చని భక్తులు పేర్కొంటున్నారు. గుట్టపైన సహజంగా ఏర్పడిన కోనేరు చుట్టూ శాశ్వత నిర్మాణాలు లేవు. భక్తులు తలనీలాలు తీసుకున్న తర్వాత స్నానాలు చేయడానికి బాత్‌రూంలు సైతం శాశ్వతమైనవి లేవు. గుట్టపైకి రావడానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా నిధులు మంజూరు కాలేదు. గుట్టపైకి వచ్చే తూర్పు, పడమర వైపు ఉన్న మెట్ల వద్ద గోపురాలు నిర్మాణం చేస్తామన్న హామీ అమలు పర్చలేదు. కనీసం తాగునీటి సౌకర్యం లేదు. ఆలయ ఆస్తుల పరిరక్షణకు ఎటువంటి భద్రతా వ్యవస్థ లేకపోవడంతో ఉన్న మరుగుదొడ్ల డోర్లు, ఇతర సామాగ్రి కూడా చోరీకి గురైంది.

వేలం పాటల టెండర్లు పూర్తి

పెద్దగట్టు పైన,గుట్ట కింద భాగాల్లో మాత్రం వేలం పాటల టెండర్ ప్రక్రియను ముగించారు. దేవదాయశాఖ, మునిసిపాలిటీ శాఖలు టెండర్లు నిర్వహించాయి. దేవాదాయ శాఖకు కొబ్బరికాయలు విక్రయించే హక్కు, లడ్డూ, పులిహోర విక్రయ, తలనీలాల సేకరణ హక్కు, పచ్చి కొబ్బరికాయల సేకరణకు హక్కు మొత్తం కలిపి రూ.52 లక్షల పైచిలుకు ఆదాయం వచ్చింది. సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలో ఎగ్జిబిషన్, చిరుదుకాణాల ఖాళీస్థలం, మిఠాయి, స్వీట్లు, వరిపేలాలు, బొంగులు, చెరుకు గడలు, జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు టెండర్ల ద్వారా రూ.68 లక్షల ఆదాయం వచ్చింది. జాతరకు వేలం పాటల ద్వారా రూ.1.20కోట్ల ఆదాయం రాగా ఎవర పరిధిలో వారు పనులకు ఖర్చు చేయనున్నారు. ప్రత్యేక రాష్ట్రంలో ఆరోసారి నిర్వహించే లింగమంతుల స్వామి జాతర విజయవంతంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాల్సి ఉంది. నిధుల కేటాయింపు ఇంకా లేకపోవడంతో పెద్దగట్టు వద్ద హడావుడి కనిపించడం లేదు. అడపాదడపా భక్తులే వచ్చిపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 5 జాతరలు నిర్వహించగా 6వ జాతరను కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్వహించనుంది. నిధుల కేటాయింపునకు కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించినట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు మంజూరైతేనే పనుల చేపట్టడానికి వెళ్తామని అధికారులు అంటున్నారు. లింగమంతుల జాతర తర్వాతే నిర్వహించే మేళ్లచెర్వు జాతరపై సమీక్ష నిర్వహించిన అధికారులు పెద్దగట్టు జాతరపై ఎందుకు సమీక్షించడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

గత జాతరకు రూ.5 కోట్లు

పెద్దగట్టు జాతరకు 2023లో అప్పటి ప్రభుత్వం నుంచి రూ.2.5 కోట్లు, మునిసిపాలిటీ శాఖ నుంచి రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. వీటితో రక్తం పీల్చే యంత్రంతో పాటు సోలార్ లైట్లు, విద్యుత్ లైన్లు, గుట్ట సమీపంలోని సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దీనికి తోడు గుట్ట చుట్టూ ఉన్న సమీప గ్రామాలను అనుసంధానిస్తూ రహదారులకు మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు చేపట్టిన మార్గం గుండా ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాలను మళ్లించారు. అయితే అప్పటికప్పుడు చేపట్టిన పనులు కావడంతో కొద్దికాలానికే దెబ్బతిన్నాయి. వీటికి తోడు షామియానాలు, ఇతర తాత్కాలిక పనులు చేపట్టారు.

రూ.4.5 కోట్లతో పాలకవర్గం ప్రతిపాదనలు

జాతర సమీపిస్తుండటంతో నూతన పాలకవర్గం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పొన్నం ప్రభాకర్‌ను కలిసి నిధులు మంజూరు కోసం వినతిపత్రాలను అందజేసింది. పెద్దగట్టు సమీపంలో శాశ్వతంగా చేపట్టాల్సిన పనులను వారు వివరించారు. అందులో రూ.1.20 కోట్లతో భక్తులు సేదతీరేందుకు షెడ్‌నిర్మాణం, రూ.50 లక్షలతో శాశ్వత మరుగుదొడ్లు, రూ.1.20 కోట్లతో గుట్టపైకి ఘాట్‌రోడ్డు, గుట్టపైన కోనేరు విస్తరణకు రూ.30 లక్షలు, గుట్ట చుట్టూ ఉన్న రోడ్ల మరమ్మతులకు రూ.80 లక్షలతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పనకు నిధులు విడుదల చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఇద్దరి అరెస్ట్

మిర్యాలగూడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. తనకు వచ్చిన ఉద్యోగంలో జాయిన్ కాకుండానే ఫోన్‌పే ద్వారా జీతం డబ్బులు తన ఖాతాలో జమ కావడంతో అనుమానించిన నిరుద్యోగి వేముల వంశీ ఫిర్యాదుతో ముఠా మోసాలు వెలుగుచూశాయి. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల్ని మోసగిస్తున్న ఆరుగురిలో ఇరువురిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. స్థానిక వాసవీనగర్‌లో గ్రామీణ ఉద్యోగ సేవా కేంద్రం నిర్వహిస్తున్న రాళ్లపల్లి శ్రీధర్ కనగల్ మండలం పగిడిమర్రికి చెందిన సంపత్‌రెడ్డి వద్ద రూ.2.50 లక్షలు తీసుకుని కాంట్రాక్ట్ మాన్ పవర్ ఏజెన్సీ జాబ్ పేర నియామకపత్రాన్ని ఇచ్చారు. కాగా అతను ఉద్యోగానికి వెళ్లకుండానే శ్రీధర్ ఫోన్‌పే ద్వారా నెల జీతం చెల్లించడంతో అనుమానించిన సంపత్‌రెడ్డి తనతో పాటు హోంగార్డు ఉద్యోగానికి శ్రీధర్‌కు రూ.12 లక్షలు చెల్లించిన మిర్యాలగూడ వంశీకి తెలపడంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కమీషన్ ఆశతో..

హైదరాబాద్‌కు చెందిన ఖాసీంకు రియల్‌ఎస్టేట్‌లో ఏపీ రాష్ట్రం నంద్యాలకు చెందిన రాసపుత్ర రాఘవేందర్ అలియాస్ రాజు, మిర్యాలగూడకు చెందిన రాళ్లపల్లి శ్రీధర్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన ఎడ్ల చంద్రయ్య, మిర్యాలగూడకు చెందిన రాళ్లపల్లి నారాయణ, రాళ్లపల్లి పార్వతమ్మలతో పరిచయం ఏర్పడింది. మీరందరూ కలిసి జాబ్‌లు ఇప్పించే ఏజెన్సీ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, అందుకు పర్మిషన్ ఇప్పిస్తానని ఖాసీం మిగతా వారిని ఒప్పించాడు. జాబ్‌ల కోసం వచ్చే వారి వద్ద డబ్బులు వసూలు చేస్తే అందులో 10శాతం కమీషన్ ఇస్తానని ఆశ చూపించాడు. దీంతో హోంగార్డు జాబ్ కోసం మిర్యాలగూడలోని సుందర్‌నగర్‌కు చెందిన వంశీ వద్ద రూ.12 లక్షలు, మరో ముగ్గురి వద్ద రూ.6 లక్షల చొప్పున డబ్బులు తీసుకున్నారు. పలురకాల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మొత్తం తొమ్మిది మంది నిరుద్యోగుల నుంచి రూ.45.10 లక్షలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసులో ఏ-1 ఖాసీం, ఏ-4 ఎడ్ల చంద్రయ్య, ఏ-5 రాళ్లపల్లి నారాయణ, ఏ-6 రాళ్లపల్లి పార్వతమ్మలు పరారీలో ఉండగా ఏ-2 రాఘవేందర్, ఏ-3 శ్రీధర్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. మిగతా నిందితులను తర్వలోనే పట్టుకుంటామన్నారు. నిందితుల నుంచి రూ.లక్ష నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు, నిరుద్యోగుల బయోడేటా దరఖాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. కేసును దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న ఇన్‌చార్జి సీఐ నాగార్జున, ఎస్ఐ సైదిరెడ్డిని డీఎస్పీ అభినందించారు.

జీవితంపై విరక్తితో

వృద్ధురాలి ఆత్మహత్య

దేవరకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తి చెంది నల్లగొండ జిల్లా దేవరకొండలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ పట్టణం అయ్యప్పనగర్‌కు చెందిన కంభంపాటి సాయమ్మ(80)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నిరంజన్ నాలుగు ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కోడలు వద్దనే ఉంటు జీవనం సాగిస్తోంది. కుమారుడు మృతితో మానసిక వేదనకు గురైన సాయమ్మ దీనికి తోడు అనారోగ్యానికి గురికావడంతో జీవితంపై విరక్తి చెంది పట్టణ శివారులోని తుల్బమ్మ కుంటలోపడి మృతి చెందగా శనివారం గుర్తించి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మనవడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కొయ్యలగూడెంలో

రవితేజ అంత్యక్రియలు



రవితేజ(ఫైల్‌ఫొటో)

చౌటుప్పల్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో దుండగుల కాల్పులలో మృతి చెందిన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం వాసి కొయ్యడ రవితేజ(27) అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గ్రామంలో కుటుంబసభ్యులు, బంధువులు పూర్తిచేశారు. మృతదేహం అమెరికా నుంచి బయలుదేరింది. శనివారం రాత్రి ఢిల్లీకి చేరుకుంది. ఆదివారం తెల్లవారుజామున కొయ్యలగూడెం గ్రామానికి తీసుకురానున్నారు. రవితేజ తల్లితండ్రులు చంద్రమౌళి, సువర్ణ దంపతులు హైదరాబాద్‌లోనే ఉన్నారు. 2022లో అమెరికా వెళ్లిన రవితేజ ఉన్నత విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగ వేటలో ఉన్నాడు. రవితేజ పార్ట్‌టైమ్ జాబ్‌గా ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న ఓ ఇంట్లో ఫుడ్ డెలివరి చేసి వస్తుండగా కనెక్టికట్ రాష్ట్రంలో ఇద్దరు దుండగులు రవితేజపై కాల్పులు జరపడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. రవితేజ సోదరి కూడా అమెరికాలో చదువుకుంటోంది. రవితేజ మృతదేహంతో పాటు సోదరి కూడా వస్తుంది. తానా ప్రతినిధులు, భారత ప్రభుత్వం సహకారంతో మృతదేహం స్వదేశానికి తరలించారు. రవితేజ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నట్లు సమాచారం.

యాదగిరీశుడికి ఏకాదశి పూజలు

● *భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన*

భువనగిరి అర్బన్, జనవరి 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శనివారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వజ్రవైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించి అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ పుష్పమాలికలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమనరీతిలో గంటపాటు పూజ పర్వం కొనసాగింది.



లక్ష పుష్పార్చనలో లక్ష్మీనారసింహుడు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామి వారి సన్నిధిలో శనివారం స్వామిఅమ్మవారలకు నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొపిన అర్చకులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువు స్వామి, సువర్ణ ప్రతిష్ఠమూర్తులను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారలను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక తీర్చిదిద్ది సుదర్శన శతకపఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. ప్రధానాలయ ముఖమండపంలో దర్బార్ సేవోత్సవం చేపట్టిన పూజారులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో నిత్యారాధనలు, రుద్రహవన పూజలు శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 29,09,312 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఆలయం ఉత్తరవీధిలో రూ. 150 లడ్డు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశారు. రోజు రోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా కొత్తగా లడ్డు కౌంటర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఈవో తెలిపారు.

మత్స్యగిరీశుడి సన్నిధిలో కేంద్ర అడిషనల్ డైరెక్టర్



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

వలిగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామిని అడిషనల్ డైరెక్టర్ గౌవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ డాక్టర్ సంతోష్‌కుమార్ పాండే శనివారం దర్శించుకున్నారు. స్వామి వారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం చేసి స్వామి జ్ఞాపికను, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, ఆలయ ముఖ్య నిర్వాహణ అధికారి మోహన్‌బాబు, ధర్మకర్తలు, జగన్, మోహన్‌రెడ్డి రాములు, అమరేందర్, ప్రభాకర్, ఉషయ్య, బాలేశ్వర్, అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని విడనాడితే ప్రశాంతత

● *జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు*

భువనగిరి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు జీవితంలో నేర ప్రవృత్తిని విడనాడి సత్‌ప్రవర్తనను పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి సబ్ జైలులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. నేర స్వభావంతో వ్యక్తిగతంగా, కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని గ్రహించాలని సూచించారు. వివిధ కేసుల్లో జైళ్లలో మగ్గుతున్న ఖైదీలకు ఆరుగురు న్యాయవాదులతో కూడిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టెం న్యాయ సహాయం అందిస్తుందన్నారు. ఖైదీలకు రాజ్యాంగ హక్కులు, న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సంస్థ కార్యదర్శి వి.మాధవీలత, న్యాయమూర్తులు ఎస్.శ్యాంసుందర్, జి కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరినాథ్, చీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్ జైపాల్, జైల్ సూపరింటెండెంట్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి నట్టేట ముంచి ఉడాయింపు

- *వ్యాపారి జాడకోసం పోలీసుల ఆరా*
- *పోలీసులను ఆశ్రయించిన 200మంది బాధితులు*
- *గుట్ట పట్టణంలో గతంలోనూ మోసాల పరంపర*

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): 'పొరుగింటి పుల్లకూర భలే రుచి' అనే నానుడిని బేస్ చేసుకుని పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చి వ్యాపారాలను ఏర్పాటు చేసి, విశ్వాసంతో సేవలు అందిస్తున్నట్లు నమ్మబలికి కోట్ల రూపాయలు కొల్లగొట్టి అదృశ్యమైన వ్యాపారికి బలైన బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సంచలనాత్మక వ్యాపారమోసాలకు కేంద్రంగా యాదగిరిగుట్ట పట్టణం మారింది. దినదినాభివృద్ధి చెందుతూ పర్యాటక కేంద్రంగా ఏర్పడిన యాదగిరిగుట్టకు రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు కిరాణం, జూవెల్లర్స్ వస్త్ర వ్యాపారులుగా అవతారం ఎత్తారు. పొరుగు రాష్ట్రాల వ్యాపారాలతో వ్యాపారుల వ్యవహార శైలి స్థానికులను ఎంతో ఆకట్టుకుంది. తమ వద్దకు వచ్చే ప్రజలను విశ్వాసంతో నమ్మించి వారి వద్ద నుంచి బంగారం నగలను తీసుకుని తాకట్టు రూపంలో లక్షలాది రూపాయలను ఇవ్వడం ప్రారంభించారు. ఇదే అదునుగా చేసుకుని మాటమాట కలిపి అధిక వడ్డీల వల విసురుతున్నారు. డబ్బులు తీసుకున్నవారు తిరిగి చెల్లించి తమ ఆభరణాలను తీసుకునే అవకాశం లేకుడా వ్యాపారి ఖేల్ ఖతం చేసి రాత్రికి రాత్రే అదృశ్యమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఎంతో కష్టపడి సంపాదించిన అధిక వడ్డీకి ఆశపడి అప్పులు, బంగారం తాకట్టుపెట్టి మోసపోయిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఇప్పటి వరకు స్థానిక పోలీసులకు 200మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

మోసాల పరంపర ఇలా..

తాజాగా యాదగిరిగుట్ట పట్టణంలో రాజస్థాన్‌కు చెందిన జితేందర్ సింగ్ రాథోడ్ అనే బంగారం తాకట్టు వ్యాపారి గత 15 సంవత్సరాల క్రితం గుట్టకు వలస వచ్చి ముందుగా దుర్గా జూవెల్లర్స్‌లో పనిచేశాడు. కొంత కాలం గడిచిన తరువాత జితేందర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి కిరాణం దుకాణం సొంతంగా ఏర్పాడు చేసుకుని ప్రజలకు మరింత చేరువయ్యాడు. అప్పటి నుంచి తన వ్యాపారంతో ప్రజలను నమ్మించి అప్పులు



గుట్టలోని బంగారు ఆభరణాల దుకాణం, వ్యాపారి జితేందర్‌సింగ్ రాథోడ్(ఫైల్ ఫొటో)

తీసుకోవడం మొదలు పెట్టాడు. ఇటీవల సొంతంగా గుట్టలోనే మెయిన్ రోడ్డు పక్కల 80గజాల విస్తీర్ణం గజం రూ.1లక్షతో 80లక్షలకు కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దఎత్తున బంగారం తాకట్టు వ్యాపారం, జూవెల్లర్స్ వ్యాపారం ప్రారంభించాడు. దీంతో ప్రజలకు పూర్తిగా నమ్మకంగా కలిపించారు. స్థానికులు వేర్వురుగా సమారు మూడు కేజీల 20గ్రాముల వరకు బంగారం ఆభరణాలు తాకట్టు పెట్టుకొని, రూ.కోటీ 20లక్షల వరకు వడ్డికి ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. మరోవైపు స్థానికుల వద్ద కోట్ల రూపాయలను అప్పుగా తీసుకొని అధిక వడ్డీ నెలవారిగా ఇస్తూ ప్రజలను నమ్మించాడు. వారం రోజుల క్రితం తన వద్ద తాకట్టుపెట్టిన నగలు తీసుకుని వెళ్లానని, డబ్బులు చెల్లించాలని ఫోన్ ద్వారా సమచారం అందించి తెలివిగా డబ్బులు కట్టించుకున్నాడు. బంగారం బ్యాంకులో ఉందని రెండు రోజుల్లో వచ్చి తీసుకెళ్లాలని సూచించాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి రాత్రికే పరారయ్యాడు. మరుసటి రోజు దుకాణం వద్దకు బంగారం తీసుకోవడానికి వచ్చిన బాధితులకు దుకాణం తాళం వేసి ఉండటంతో బాధితులు ఫోన్‌చేశారు. స్విచ్ ఆఫ్ రావడంతో సమాచారం పట్టణంలో దావనంలా ప్రవహించింది. దీంతో బాధితులు దుకాణం ఎదుట రాత్రి 8గంటల వరకు ఆందోళన చేసి పోలీసులను ఆశ్రయించారు.


● 2010 సంవత్సరంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన అర్జున్ అనే వ్యక్తి వస్త్ర దుకాణం ఏర్పాటు చేసుకొని స్థానిక ప్రజలను నమ్మించి వారి వద్దనుంచి డబ్బులను వడ్డీకీ తీసుకొని సుమారు రూ. 5కోట్ల రూపాయలతో ఉడాయించాడు.

● 2022 సంవత్సరంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరోవ్యక్తి పలని అనే వస్త్ర వ్యాపారి పట్టణంలో సుమారు 10సంవత్సరాలుగా వ్యాపారం చేస్తూ ప్రజలు పూర్తిగా నమ్మే విధంగా నూతన వస్త్రాలను తీసుకు వచ్చి, మహిళలను నమ్మించాడు. తమ వ్యాపారం నిమిత్తం అధిక వడ్డీ ఇస్తానని స్థానికులను మచ్చిక చేసికుని సుమారు రూ. 6కోట్లతో ఉడాయించాడు.

● 2023 సంవత్సరంలో పట్టణంలో నివాసం ఉంటున్న ట్రాన్స్‌జెండర్ స్థానికుల వద్ద డబ్బులను అధిక వడ్డీ ఇస్తానని, మరోవైపు చిట్టీల వ్యాపారం చేసి సుమారు రూ. 3కోట్ల వరకు డబ్బులు దండుకొని పారిపోయింది.

ఇప్పటి వరకు పట్టణంలో నలుగురు వ్యక్తులు కోట్ల రూపాయాల నగదు... బంగారం దండుకొని ప్రజలకు కుచ్చుటోపీ పెట్టారు. గుట్టలో ఇలాంటి మోసాలు వరుసగా జరుగడంతో ప్రజలు లబోదబోమంటున్నారు. ప్రజల ఆశ- నమ్మకాన్ని ఆసరా చేసుకుని బరిడీ బిజినెస్ చేస్తున్న ఇలాంటి వ్యాపారుల పట్ల పారాహుషార్ ...! అంటూ పలురురు హెచ్చరిస్తున్నారు. అతి విశ్వాసంతో నమ్మి ఉన్నదంత కోల్పోతున్న బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగకుండా అవగాహనతో కూడిన చైతన్య కార్యక్రమాలను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సామాజిక సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలతో ప్రజలను చైతన్యం చేయాలని పలువురు కోరుతున్నారు.

బాధితులను ఆదుకుంటాం: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



పట్టణంలో బంగారు తాకట్టు వ్యాపారం మేరుతో ప్రజలను నమ్మించి కోట్ల రూపాయలను దండుకుని, మోసంచేసి పారిపోయిన జితేంద్‌సింగ్ రాథోడ్‌ను తప్పకుండా పట్టుకొని బాధితులకు న్యాయం చేస్తాం. వ్యాపారికి సబంధించిన పట్టణంలో ఇతర దుకాణాలకు చెందిన నలుగురు యజమానుల దుకాణాలకు తాళం వేయాలని పోలీసులను ఆదేశించాం. వారి జాడతెలిపే వరకు దుకాణాలు తెరిచేది లేదని వ్యాపారికోసం డీసీపీ, ఏసీపీలతో మాట్లాడి ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశాం. పాస్‌పోర్టు తీసుకొని ఇతర దేశాలకు వెళుతున్నట్లు సమాచారం వచ్చిందని వెంటనే, పాస్‌పోర్టును రద్దుచేయాలని సబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

మత్స్యకారుల వలలు తగలబెట్టిన అమ్రాబాద్ అటవీ అధికారులు

● *మత్స్యకారుల గుడిసెలు పీకేసిన వైనం* ● *తమకు న్యాయం చేయాలని మత్స్యకారుల విన్నపం*

నాగార్జునసాగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులపై అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు జులుం చూపించారు. కృష్ణమ్మ తల్లిని నమ్ముకొని చేపల వేటను తమ జీవనాధారంగా కొనసాగిస్తూ బతుకుతున్న మత్స్యకారుల వలలు, తగలబెట్టి, గుడిసెలు తొలగించారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం గద్దల చెరువు ఆలటం, ఏడు వంపుల తొట్టి, మోలరేవు ప్రాంతంలో జరిగింది. ఈ ప్రాంతం అటు ఏపీలో వెల్దుర్తి మండలంలో ఇటు తెలంగాణలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో నదికి ఇరు వైపుల అటువైపు, ఇటు తెలంగాణ మత్స్యకారులు పుట్టీలలో నదిలో విహరిస్తూ వలలు వేస్తూ చేపల వేటను కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అటవీ అధికారులైన బీట్ ఆఫీసర్, 15 మంది గార్డులు, సెక్షన్ ఆఫీసర్ జలాశయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో నది ఒడ్డున ఉన్న మత్స్యకారుల వద్దకు వచ్చి ఇక్కడ నుంచి గుడిసెలు, వలలు తీసివేయాలని హెచ్చరించారు. అలా చెప్పి వెళ్లిన అటవీ శాఖ అధికారులు అరగంటలోనే మళ్లీ మత్స్యకారుల వద్దకు వచ్చి మీరు ఇంత వరకు ఎందుకు గుడిసెలు, వలలు తీసేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారని, ముగ్గురిని కొట్టారని మత్స్యకారులు వాపోయారు. అంతటితో ఆగకుండా గుడిసెలను పీకేసి, వలలను తగులబెట్టారన్నారు. తమకు న్యాయం చేసి అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



అటవీశాఖ అధికారులు తగలబెట్టిన మత్స్యకారుల వలలు

విదేశీ ప్రతినిధుల సందడి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చేనేత రంగం పరిస్థితులను అధ్యయనం చేసేందుకు అమెరికా సంయుక్త రాష్ట్రానికి (యూఎస్‌ఏ) చెందిన వాషింగ్టన్ డీసీలో ప్రొఫెసర్‌గా, ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తున్న నేవిల్ శనివారం యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి సందర్శించారు. హైదరాబాద్‌లోని షైవే ఆర్గనైజేషన్ టూరిస్ట్ గైడ్ విడిలి చౌదరి ఆధ్వర్యంలో యూఎస్‌ఏ ప్రతి నిధులు ఇక్కడికి వచ్చారు. పట్టణంలోని కళా పునర్వి చేనేత యూనిట్‌ను సందర్శించి కార్మికుల చేనేత పనితీరును పరిశీలించారు. అనంతరం గ్రామీణ పర్యాటక కేంద్రంలోని మ్యూజియం సందర్శించి లీవ్‌టుక్లాత్ ప్రాసెసింగ్ యూనిట్‌లో కార్మికులు రూపొందించే కళా త్మాక వస్త్రాలను పరిశీలించారు. చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించి చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. చేనేత కార్మికుల జీవన స్థితిగతులను వారు అధ్యయనం చేశారు.



చేనేత కార్మికుల పనితీరును పరిశీలిస్తున్న విదేశీ ప్రతినిధులు

53 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దఅడిశర్లపల్లి, జనవరి25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని ఎర్రగుంటతండా, తిరుమలగిరి గ్రామాల్లో రేషన్ డీలర్ల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 53 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు, గుడిపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఆర్ఐసీఎస్ సైదులు వివరాల ప్రకారం... మండలంలోని ఎర్రగుంటతండా, తిరుమలగిరి రేషన్ డీలర్లు అక్రమంగా రేషన్ బియ్యాన్ని దాచి ఉంచారనే సమాచారం మేరకు ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, పోలీసులు దాడి చేశారు. రెండు షాపుల్లో కలిపి 53.5 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



చిట్యాలరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదిరిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా గోకారం గ్రామానికి చెందిన దేశపాక ముత్తయ్య(60) తన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనంపై వెలిమినేడు శివారులోని శుభం గార్డెన్స్ ఫంక్షన్‌హాల్ నుంచి పిట్టంపల్లి క్రాస్ రోడ్డు వద్ద వెలిమినేడు గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. హైదరాబాద్ నుంచి వచ్చే కారు ముత్తయ్య ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముత్తయ్యకు తీవ్రగాయాలై రోడ్డుపై అపస్మారకస్థితిలో పడిపోయాడు. అదే సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాహనశ్రేణికి ఎస్కాట్‌గా వెళ్లి చిట్యాలకు వెళ్తున్న చిట్యాల ఎస్ఐ ప్రమాదాన్ని గమనించి ముత్తయ్యను బతికించేందుకు వెంటనే ఎస్ఐ ధర్మ సీపీఆర్ చేయగా అయినా ఆయనలో చలనం లేకపోవడంతో మృతిచెందాడని నిర్ధారించారు. చిట్యాల పోలీసులు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ధర్మ తెలిపారు.

CLASSIFIEDS

చెదలు & బొద్దింకల నివారణ

★ చెదలు & బొద్దింకల నివారణకు HANUMAN PEST CONTROL, WATER PROOFING సంప్రదించండి సెల్: 7671060524.

AJW_223974

SHOP FOR SALE

★ సూర్యాపేట జిల్లా కోదాడ మెయిన్ రోడ్‌లో కోదండరామస్వామి దేవాలయం మరియు R&B బిల్డింగ్ ఎదురుగా (85 గజాలు) Shop ... సంప్రదించండి: 8309174956, 9618054289

AJW-226015

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారుల ద్వారా లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించిన పాఠకులకు ... బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/-Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413365 9985413656

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9985410384

చెర్వుగట్టు జాతర ఏర్పాట్లు షురూ

నార్కట్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు షురూ అయ్యాయి. ఈ నెల 16వ తేదీన నిర్వహించిన స మన్వయ సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికార యంత్రాంగం ఇప్పటికే దృష్టి సారించింది. ప్రచార కార్యక్రమాలను ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా ప్రారంభించగా ఉమ్మడి జిల్లాతో పాటు చెర్వుగట్టుకు అ త్యధికంగా భక్తులు వచ్చే ప్రాంతాల్లో ప్రచారరథాలను పంపారు. ఆయా ముఖ్య పట్టణాల్లో పోస్టర్లు అంటించే పనులు చేపట్టారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే నార్కట్‌పల్లి సీఐ, ఎస్ఐలు ట్రాఫిక్ సమస్యకు కారణమవుతాయని భావిస్తున్న దుకాణదారులను తమ షాపుల ముందు వేసిన రేకులను వెనక్కి జరుపుకోవాలని హెచ్చరించారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చెర్వుగట్టుకు నలువైపులా ఉన్న రోడ్లపై మట్టితో చదును చేసే పనులను ప్రారంభించారు. బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంటలకు ప్యాచ్ వర్కు పనులను కొనసాగిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ఎంపిక చేసిన స్థలాలను పోలీసులు, దేవస్థానం అధికారులు పరిశీలించారు. ప్రముఖులకు బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికలను అందజేయనున్నారు.



చెర్వుగట్టులో మట్టితో రోడ్లను చదును చేస్తున్న సిబ్బంది

బీడబ్ల్యూఎఫ్ కోచింగ్‌కు రామకృష్ణ

మిర్యాలగూడ టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మారబోయిన రామకృష్ణ బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) కోచింగ్‌కు ఎంపికయ్యారు. డీఎ‌స్ఏ జిల్లా కోచ్‌గా వ్యవహరిస్తున్న రామకృష్ణ బీడబ్ల్యూఎఫ్ కోచర్స్ శిక్షణకు ఎంపికైనట్లు స్టేట్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ సందర్భంగా రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ బీడబ్ల్యూఎఫ్ కోచింగ్‌కు ఎంపిక చేసిన ఇండియన్ సీనియర్ ప్లేయర్, అకాడమీ వ్యవస్థాపకుడు పుల్లెల గోపీచంద్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.



రామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న గోపీచంద్

పర్యాటకరంగంతో సుస్థిర అభివృద్ధి

● *డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి*

నల్లగొండటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంతో అపారమైన సుస్థిర అభివృద్ధి - వ్యాపార అవకాశాలు ఉంటాయని ప్రముఖ చరిత్రకారుడు, పురావస్తు శాస్త్రజ్ఞుడు స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పర్యాటక దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్యాటకరంగం అపారమైన అవకాశాలతో పాటు సుస్థిర అభివృద్ధికి సైతం బాటలు వేస్తుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భిన్న భౌగోళిక, చారిత్రక ప్రదేశాలు ఉన్న కారణంగా అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకరంగం స్వతహాగా అవకాశాలను ఏర్పర్చుకుంటూ వినోదం, ఆహ్లాదం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మికత, ఆరోగ్యం వంటి భిన్న ప్రయోజనాలు రంగాల్లో విస్తరిస్తుందన్నారు. డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విభాగ అధిపతి డాక్టర్ సబీనా హెరాల్డ్, డాక్టర్ మిరియాల రమేష్, డాక్టర్ లక్ష్మీప్రభ, డాక్టర్ సూరంశ్వేత, డాక్టర్ ప్రవళిక, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి


గుండ్రాంపల్లిలో 4 వేల ఏళ్ల నాటి రాతిగొడ్డలి లభ్యం

చిట్యాలరూరల్: పురాతన వారసత్వ చారిత్రక సంపదను సంరక్షించుకోవాలని ప్లీచ్ ఇండియా సీఈవో, పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ప్రిజర్వ్ హెరిటేజ్ కార్యక్రమంలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో గుండ్రాంపల్లి-ఏపూర్ గ్రామాల నడుమ ఉన్న నాగులకట్ట వద్ద చేపట్టిన అన్వేషణలో పురాతన రాతి గొడ్డలి, కాకతీయుల కాలం 13వ శతాబ్దం నాటి దేవతల విగ్రహాలు లభ్యమైనట్లు ఆయన తెలిపారు. రాతిగొడ్డలిని, విగ్రహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతనమైన కొన్ని వందల సంవత్సరాల క్రితం వి గ్రహాలు వస్తువులను కాపాడుకోవాలని అన్నారు. క్రీ.పూ. 4 వేల ఏళ్ల నాటి రాతి గొడ్డలి లభ్యం కావడం ఎంతో అదృష్టమని, వాటిని చూస్తే ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. పురాతన దేవాలయాలు విగ్రహాల పరిశోధనలో భాగంగా గుండ్రాంపల్లి శివారులో పురాతన ఆలయం విగ్రహాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు పరిశీలించగా క్రీ.పూ.4వేల ఏళ్ల రాతి గొడ్డలి లభించిందన్నారు. 15 సెం.మీ పొడవు, 5 సెం.మీ. వెడల్పు, 2 సెం.మీ మం దమున్న నల్లసానపు రాతిగొడ్డలి ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా కాకతీయుల కాలం నాటి క్రీ.శ.13వ శతాబ్దం నాటి అద్భుతమైన నాగదేవతల శిల్పాలు కూడా ఉన్నాయన్నారు. విగ్రహాలు సంరక్షణ లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పురాతనమైన వారసత్వ చారిత్రక సంపదను, శిల్పాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట వారసత్వ కార్యకర్త యడ్లపల్లి అమర్నాథ్ ఉన్నారు.



గుండ్రాంపల్లిలో కొత్త రాతియుగపు ఆనవాళ్ల గొడ్డలిని చూపుతున్న శివనాగిరెడ్డి

పదవీ విరమణ శుభాకాంక్షలు



మీ కుటుంబ సభ్యులలో, బంధుమిత్రులలో, సహోద్యోగులలో ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా ?

అయితే వారికి తీపి గుర్తుగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి

పదవీ విరమణ శుభాకాంక్షలు

ఆంధ్రజ్యోతి అందిస్తోంది

జిల్లా ప్రకటనలకు 25% తగ్గింపు

GST 5% అదనం

అద్దంకి బైపాస్ రోడ్, ఆర్జాలబావి, నల్లగొండ, సెల్ : 9985410384

నల్లగొండ : 99854 13656, 99854 13365

సూర్యాపేట : 97036 18713, కోదాడ : 80967 10822

దేవరకొండ, మిర్యాలగూడ, భువనగిరి, చౌటుప్పల్ : 99854 10384

పథకాలతో సంక్షేమానికి శ్రీకారం

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్రదినోత్సవం సందర్భంగా మరిన్న పథకాలతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి శ్రీకారం చుట్టనున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం యాదగిరిగుట్ట మునిసిపల్ చివరి సాధారణ సర్వసభ్య సమావేశం మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గం వ్యాప్తంగా మొదట ప్రతీ మండలంలో ఒక గ్రామం, గుట్ట, ఆలేరు మున్సిపాలిటీలో లబ్ధిదారులకు పథకాలు అందజేయనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి పథకాలు అందుతాయని అన్నారు. పథకాలు రానివారు ఆందోళన చెందవద్దని పథకాల దరఖాస్తులు నిరంతం కొనసాగుతూనే ఉంటాయని ఎలాంటి ఇబ్బందులు ప్రజలకు ఉండవని అన్నారు. రేపటితో మునిసిపల్ పాలకవర్గం పూర్తి అయినప్పటికి సంబంధిత కౌన్సిలర్లు ఎప్పటికీ అభివృద్ధి పనులను విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తే సాధ్యమైనంతవరకు పూర్తి చేస్తానని అన్నారు. వేసవి సమీపిస్తుడటంతో ప్రధానంగా తాగునీటి సమస్య రాకుండ తగిన నిర్ణయాలు తీసుకుంటున్నామని, మార్చి నెలాఖరు వరకు రూ.210కోట్ల చేపట్టిన మిషన్‌భగీరథ పనులు పూర్తి అవుతాయని అన్నారు. యాదగిరిగుట్టలో నీటి సమస్య ఉండదని, మరోవైపు అమృత్ పథకం ద్వారా పట్టణంలో 22లక్షల లీటలర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకులు త్వరలో పూర్తి అవుతాయని దాంట్లో నీరు నిలువ చేయడంతో తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోనుందని అన్నారు. గుట్ట మున్సిపల్ అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఇప్పటి వరకు 5సంవత్సరాల కాలం పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించిన చైర్ పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్ల అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు గౌళికార్ అరుణరాజేష్, బూడిద సురేందర్, సీసీ విజయలక్ష్మీకృష్ణగౌడ్, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, బిట్లు సరోజహరీష్, ముక్కెర్ల మల్లేష్ యాదవ్, దండెబోయిన అనిల్, తాళ్లపల్లి నాగరాజు, ఆవుల మమత సాయి, బబ్బూరి మౌనికశ్రీధర్ పాల్గొన్నారు.



మునిసిపల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

ప్రజాప్రతినిధుల సేవలు అభినందనీయం

భువనగిరి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జరిగిన భువనగిరి మునిసిపల్ కౌన్సిల్ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టమని అన్నారు. ఐదేళ్లపాటు పట్టణ అభివృద్ధికి కృషి చేసిన కౌన్సిల్‌ను అభినందించారు. చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో ప్రస్తుత కౌన్సిల్ పాత్ర కీలకమైనదని అన్నారు. మునిసిపల్ యంత్రాంగం సహకారంతో పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేశామన్నారు. వైస్ చైర్మన్ మాయ దశరథ మాట్లాడుతూ ఐదేళ్లపాటు పార్టీలకతీతంగా సభ్యులందరూ పట్టణ ఉన్నతికి కృషి చేశామన్నారు. ప్రస్తుత కౌన్సిల్ మాజీ చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య సేవలను పలువురు కొనియాడారు. కాగా చివరి సమావేశంలో పట్టణంలోని 35 వార్డులకుగాను ఒక్కోవార్డుకు రూ. 10లక్షలు స్టాంప్ డ్యూటీ నిధులను కేటాయిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. దీంతో రూ.3.50కోట్ల వ్యయంతో పట్టణ వ్యాప్తంగా ఒకే పర్యాయం అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. సభ్యులందరినీ ఎమ్మెల్యే చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్ శాలువా, మెమెంటోతో సత్కరించారు. సభ్యులందరూ కలిసి గ్రూప్ ఫోటోదిగి, కలిసి విందు ఆరగించి ఆత్మీయంగా పరస్పరం వీడ్కోలు పలికారు. కమిషనర్ పి.రామాంజులరెడ్డి పాల్గొన్నారు.



భువనగిరి మునిసిపల్ పాలకవర్గం గ్రూప్ ఫొటో

సమాచారం

ఫుట్‌బాల్ రాష్ట్ర పోటీల్లో మోత్కూరు విద్యార్థుల ప్రతిభ

మోత్కూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఫుట్‌బాల్ పోటీల్లో హైద్రాబాదు క్లబ్ జట్టుకు రజత పథకం లభించింది. హైద్రాబాదు క్లబ్ జట్టులో మోత్కూరు సేక్రెడ్ హార్ట్ హైస్కూలు విద్యార్థినులు జి.వర్షిణి, జి.నిఖిత ఆడి చక్కని ప్రతిభ కనబర్చారు. వారికి హైద్రాబాదు క్లబ్ నుంచి ఒక్కో విద్యార్థినికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందించారు. రజత పథకం సాధించిన ఆ విద్యార్థినులను శనివారం సేక్రెడ్ హార్ట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.తానయ్య, వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ ఝాన్సీ, పీటీలు ఎం.యాదయ్య, ఎండి.చాంద్‌పాషా, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్న పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

‘మునినిసిపల్’ సేవలు అభినందనీయం



మునిసిపల్ చైర్మన్ శంకరయ్యను సన్మానిస్తున్న గొంగిడి దంపతులు

ఆలేరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో ఆలేరు పట్టణ అభివృద్ధికి మునిసిపల్ పాలకవర్గం విశేష కృషిని అందించడం అభినందనీయమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. ఆలేరు మునిసిపల్ పాలకవర్గం బాధ్యతలు ఈనెల 26తో ముగిసిపోతున్నందున శనివారం మునిసిపల్ కార్యాలయ అధికారులు ఏర్పాటు చేసిన పాలకవర్గంకు వీడ్కోలు సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన ఆలేరు మునిసిపల్ పరిధిలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన నిధులతో అభివృద్ధి పనులు చేసి, ప్రజామన్ననలు పొందడం సంతోషదాయమకన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి ఉద్యోగ విరమణ ఉంటుందని రాజకీయ నాయకులకు రాజకీయ విరమణ లేదని వారు ఈసందర్భంగా గుర్తు చేశారు. అనంతరం మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లను శాలువాతో సన్మానించి, అభినందించారు. మునిసిపల్ పూర్వ కమిషనర్ చక్రపాణి, అధికారులు వెంకటేశ్వర్లు, శారద, జగన్‌మోహన్, వీరస్వామి, లత, రాజేశ్, రాణి పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మించి, ప్రజల ప్రాణాలను కాపాడాలి



ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అండర్‌పాస్ నిర్మాణ సాధన కమిటీ సభ్యులు

భువనగిరి రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భువనగిరి ప్రభుత్వ ఐటీఐ వద్ద జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి అండర్‌పాస్ నిర్మాణ సాధన కమిటీ సభ్యులు వినతి పత్రం అందచేశారు. జిల్లా కేంద్రమైన భువనగిరి నుంచి భువనగిరి, వలిగొండ, ఆత్మకూర్ (ఎం), మోటకొండూరు మండలాలకు సంబంధించి సుమారు 40గ్రామాల ప్రజలు జాతీయ రహదారిని దాటుతూ రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. అండర్‌పాస్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అండర్‌పాస్ నిర్మాణ సాధన కమిటీ సభ్యులు సిల్వేరు ఎల్లయ్య, కంచి మల్లయ్య, మందాడి సిద్దారెడ్డి, బాల్ద రాములు, అంజయ్య, అయిలయ్య, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బర్రె జహంగీర్, ఈరేకార్ శ్రీను, పిట్టల బాలరాజు పాల్గొన్నారు.

పథకాలపై అపోహలొద్దు: రాజేష్ పైలెట్

బొమ్మలరామారం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నేటి నుంచి అమలు చేస్తున్న నాలుగు పథకాలపై లబ్ధిదారులు ఎలాంటి అపోహలకు గురి కావద్దని భువనగిరి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేష్ పైలెట్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నెల రోజులుగా ప్రతీ గ్రామంలో ప్రజా పాలన ద్వారా వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో సర్వేను నిర్వహించి సర్వే ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు.

ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయాలి

భువనగిరి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పరుల ప్రాణాలు కాపాడేందుకు ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. శనివారం భువనగిరిలోని జాగృతి డిగ్రీ, పీజీ కళాశాలలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 40 మంది రక్తదానం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏతి మణిపాల్‌రెడ్డి, సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, పట్టణ చైర్మన్ వెల్లంకి పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లిలో ఎన్‌సీసీ కేడెట్ల ర్యాలీ

తుర్కపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో రామపురం ఆదర్శ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఓటు అనేది ప్రాణవాయువులాంటిదని ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీవో ఝాన్సీలక్ష్మీబాయి కోరారు. ఎంపీవో వెంకటేశ్వర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, ఎన్‌సీసీ కేర్ టేకర్ మహేశ్, ఉపాధ్యాయులు సునీత, సతీష్, చంద్రారెడ్డి, కార్తీక్, సంగీత్ పాల్గొన్నారు.

కేశవరావుజాదవ్ పురస్కారానికి సురేందర్‌రెడ్డి ఎంపిక

భువనగిరి రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది, తెలంగాణ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావి సురేందర్‌రెడ్డి కేశవరావు జాదవ్ పురస్కారానికి ఎంపికయ్యారు. రావి సురేందర్ రెడ్డి 1997లో దగా పడ్డ తెలంగాణ సదస్సు కన్వీనర్‌గా వ్యవహరించి ప్రొఫేసర్ కేశవరావు జాదవ్ తెలంగాణ యుద్ధ నౌక గద్దర్, గాదె ఇన్నయ్యలతో కలిసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం భువనగిరి జూనియర్ కళాశాల ఆవరణలో పెద్ద ఎత్తున బహిరంగ సభ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తెలంగాణ అవశ్యకత, వనరులు, నిధులు, నీళ్ల తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచారు. ప్రొఫేసర్ కేశవరావు జాదవ్ 92వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో కేశవరావు జాదవ్ పురస్కార అవార్డును అందుకోనున్నారు.

క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం

రామన్నపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో క్రీడాకారులు పాల్గొనాలని రామన్నపేట పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ పి.మల్లయ్య అన్నారు. మండలంలోని తుమ్మలగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా పూస బాలకిషన్, పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను రామన్నపేట ఎస్‌ఐ పి.మల్లయ్య శనివారం ప్రారంభించారు. రామన్నపేట మండల మాజీ ఎంపీపీ పూస బాలకిషన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగోని వెంకటేశం, మల్లం ఆగయ్య, పబ్బు రమేష్, మల్లయ్య, విక్కి, నరేష్, మచ్చేందర్, సాయి, సందీప్, క్రీడాకారులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

ఆలేరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని , ఓటు విలువ తెలుసుకుని ఓటర్లు సరైన దిశలో ఓటు వినియోగించుకోవాలని ఆలేరు మండల తహసీల్దార్ అంజిరెడ్డి అన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎన్‌సీసీ విభాగం, ఉద్యోగులు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. ప్రతీ ఓటూ ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైందని ఓటు వేయడం ప్రతీ పౌరుడి బాధ్యత అని తెలిపారు. 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ముందుగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజూల, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్, డీటీ అశోక్, ప్రదీప్, ఆర్ఐ పూర్ణచందర్, కార్తీక్, మల్లేశ్, బాలయ్య , ఉపాధ్యాయులు సత్యనారాయణ, నరేందర్, రాజు పాల్గొన్నారు.

మోటకొండూరు : మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, మనవ హారం చేశారు. తహసీల్దార్ శాంతిలాల్, ఎంఈఓ కేతిరెడ్డి రఘురాం రెడ్డి, ఆర్ఐ వెంకటరామారావు, ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, పీఈటీ నాతి మల్లేష్ పాల్గొన్నారు.

మోత్కూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ డి.రాంప్రసాద్, ఎంపీడీవో డి.బాలాజీ, ఎంపీవో పి.జనార్ధన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, మండల పరిషత్ సూపరింటెండెంటు దయాకర్, ఆర్ఐలు సుమన్, శ్రీనివాస్, ఏవో వి.కీర్తి పాల్గొన్నారు.



మోటకొండూర్: మానవహారంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

వలిగొండ: మండలం కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ పుష్ప, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగేష్ జూనియర్ అసిస్టెంట్ శివాజీ పాల్గొన్నారు.

రామన్నపేట: స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట తహసిల్దార్ లాల్ బహదూర్ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో భూక్యా యాకూబ్‌నాయక్, రెవిన్యూ సిబ్బంది ఆర్ఐలు శోభ, రాజేశ్వర్, గాలయ్య, వినిత, స్రవంతి, శైలజ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుండాల: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ జలకుమారి, డీటీ నీలిమా, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఆర్ఐ అనసూయ, బీఎల్‌వోలు అనిల్, వాణి, కృష్ణ, యాదగిరి పాల్గొన్నారు.

సామాజిక సేవ చేసినప్పుడే గుర్తింపు

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): సమాజంలో సమాజిక సేవలు అందించినపుడే సంస్థకు వ్యక్తి మంచి ప్రత్యేక గుర్తింపు వస్తొందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన దివంగతుడు బోషోల్ల సత్తయ్య జ్ఞాపకార్థమై కుమారుడు బోషోల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్ డ్రెస్‌లను అందజేశారు. విద్యార్థులకు ఉచితంగా డ్రెస్సులు అందించిన బోషాల్ల శ్రీనివాస్‌ను అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడలలో నైపుణ్య ప్రతిభను కనబర్చి క్రీడలలో రాణించాలని వారికి చక్కని భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గవ్వల రాములు, మల్లాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించాలి

భువనగిరి రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకు ప్రతి ఒక్కరు తోడ్పాటునందించాలని ఎంఈవో పి నాగవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి మండలం నందనం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో భ్రమరాంభ సొంత నిదులతో విద్యార్థులకు టైలు, బెల్టులు, షూలు అందచేశారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్‌లో సుశిక్షితులైన ఉపాధ్యాయులతోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పంతంగి రవీందర్ పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్లకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆరోగ్య బీమా, మట్టి ఖర్చులకు రూ. 50వేలు ప్రభుత్వం చెల్లించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని జలాల్‌పూర్ సబ్‌సెంటర్ ఆశావర్కర్ గుర్రు స్వరూప(45) మృతి చెందారు. ఆమ మృతదేహానికి మండల ఆశావర్కర్లు నివాళులర్పించారు. ప్రజల ఆర్యోం కోసం నిరంతరంగా సేవలు అందించే ఆశావర్కర్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలకు ఎలాంటి ఎక్స్‌గ్రేషియా లేకపోవడం, ఆరోగ్యబీమా లేకపోవడం, మట్టి ఖర్చులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడం విచారకరమన్నారు. ఆశావర్కర్ అంత్యక్రియలకు ఆశాలు విరాళాలు పోగుచేసి నిర్వహించారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ.

భువనగిరి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భువనగిరి తాతానగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గుర్రాల లక్ష్మమ్మ, లక్ష్మయ్య ఫౌండేసన్ ఆధ్వర్యంలో శనివారం బెల్టులు, టైలు అందజేసారు. ఫౌండేషన్ చైర్మెన్ గుర్రాల శ్రీనివాస్ టై, బెల్టులు అందజేసి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామన్నారు. చదువు, ఆటలలో ప్రతిభ చూపే విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతకార్మికుని కుటుంబానికి చేయూత

ఆత్మకూరు(ఎం) జనవరి 25: (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రానికి చెందిన రాగీరు అంజయ్య అనే నిరుపేద గీతకార్మికుడు అనారోగ్యంతో ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న కౌండిన్య అసోసియేషన్ ప్రతినిధి నాతి గణేష్ శనివారం బాధితుని కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.అంజయ్య కుటుంబసభ్యులు చిరు వ్యాపారం చేసుకోవడానికి మా సంస్థ ద్వారా చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. గీతకార్మికుల కుటుంబాలకు చెందిన పేదవిద్యార్థులకు విద్యాబోధనకొరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించనున్నట్లు గణేష్ తెలిపారు. కార్యక్రమంలో కల్లుగీతకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు, పంజాల నర్సయ్య, చెరుకు మల్లేశం, రంగ సత్యనారాయణ ఉన్నారు.

సేవలు అభినందనీయం

మోటకొండూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు తమ సంస్థ ద్వారా ఆర్థిక సహకారం అందించి చేయుతనిస్తున్న కౌడిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సేవలు అభినందనీయమని జిల్లా ఎక్సైజ్ సుపరిండెంట్ సైదులు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గౌడ సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గీత కార్మికులకు కౌడిన్య అసోసియేషన్ వారు అందిస్తున్న ఇన్సూరెన్స్ భీమా పథకానికి సంబంధించిన బాండ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు నాతి గణేష్, గౌడ సంఘం అధ్యక్షుడు గాజుల బాలరాజు, ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య, వంగాల స్వామి, తండ పాండురంగయ్యగౌడ్, మల్లేష్ ఉన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

రామన్నపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ సురేందర్ అన్నారు. డాన్ బోస్కో హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, మత్తు మందుల, గుట్కాలు ప్రమాదకరమన్నారు. విద్యార్థులు ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. కార్యక్రమంలో డాన్ బోస్కో హైస్కూల్ పీజీవి చిట్టిబాబు, స్కూల్ ప్రిన్సిపల్ పిఎన్ జనార్ధన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె జానిపాషా, ఎస్ కృష్ణమూర్తి, లింగస్వామి, స్కూల్ ఇంచార్జీలు హీన, విజయలక్ష్మీ, ఎస్డీ ఖాదీర్, పీఈటీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు కార్పెట్లు అందజేత

మోత్కూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీలోని బుజిలాపురం గ్రామ ఆర్ఎంపీ డాక్టర్, సుశృత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోక బిక్షం శనివారం మోత్కూరు ఉన్నత పాఠశాలకు రూ.పది వేల విలువైన కార్పెట్లు విరాళంగా అందించారు. గత(2024) ఆగస్టు 15న విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి ఆయన రూ.5వేల విలువైన ప్లేట్లు అందించారు.

బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో ధర్నా చేయాలి

● వారి హయాంలోనే ‘ఆర్ఆర్ఆర్’ జీవోల జారీ
● దొంగే కన్నీరు కార్చినట్టుగా ఆ రెండు పార్టీ వైఖరి
● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడే ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ పూర్తియి భూ సేకరణకు, పనులకు పలు జీవోలు కూడా జారీ అయ్యాయని, కానీ అప్పుడు అడ్డుకోలేని ఆ రెండు పార్టీల నాయకులు నేడు రైతులను మోసగించేలా దొంగ ధర్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం భువనగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీకి తాను సన్నిహితుడునని పేర్కొనే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అలైన్‌మెంట్‌ను ఢిల్లీలో మార్పించాలన్నారు. మూడుసార్లు అలైన్‌మెంట్ మారి ప్రస్తుత అలైన్‌మెంట్ ఖరారు అవుతున్న విషయం అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి అప్పట్లోనే తెలిసినప్పటికీ పక్కనే గల తన వెంచర్‌కు నష్టం కలగకుండా మాత్రమే జాగ్రత్త పడి రాయిగిరి రైతులను నిలువెల్లా మోసం చేశాడని ఆరోపించారు. ఆ రెండు పార్టీల నేతల వైఖరి నేడు దొంగ కన్నీరు కార్చినట్టుగా ఉన్నదన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా అలైన్‌మెంట్ మార్పు కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్‌చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్ పాల్గొన్నారు.



బీబీనగర్: ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

అక్కన్న మాదన్న ఆలయాల అభివృద్ధికి కృషి ..

బీబీనగర్: చారిత్రక నేపథ్యం కలిగిన అక్కన్న మాదన్న ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం బీబీనగర్ మండలం మహాదేవ్‌పూర్‌లోని శతాబ్దాల చరిత్ర కలిగిన అక్కన్న మాదన్న ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా నియమితులైన కవాడపు శివారెడ్డి, ధర్మకర్తల ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈవో రుద్ర వెంకటేశ్ చైర్మన్, ధర్మకర్తలచేత ప్రమాణస్వీకారం చేయించగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. అనంతరం మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన కొలిచెలిమి శ్యాం, బానోతు దేవ్‌సింగ్‌లను సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, శ్యాంగౌడ్, పింగల్‌రెడ్డి, సత్తిరెడ్డి, సుభాష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మోసాలతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీత

ఆలేరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి వారి ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా మోసపూరిత విధానాలతో పాలన సాగిస్తూ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆలేరు ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి 13నెలలు అవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల పేరుతో కాంగ్రెస్ నాయకులు నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలో లబ్ధిదారులకు పథకాలు అందించకపోవడం, తిరిగి దరఖాస్తులు స్వీకరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరిందన్నారు. మోసపూరిత విధానాలు మాని ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్‌పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేశ్, నాయకులు ఎం.వెంకటేశ్, బింగి రవి, ఆరే రాములు, సంపత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



శ్రీనివాస్ గుప్తాను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బీబీనగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బీబీనగర్ పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పట్టణ తాజామాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి భర్త శ్రీనివాస్ గుప్తా , బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అశోక్‌తో పాటు మరి కొంత మంది కాంగ్రెస్‌ను వీడి సొంత గూటికి బీఆర్ఎస్‌లో చేరారు. బీబీనగర్ తాజామాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మీ శ్రీనివాస్ దంపతులు ఎన్నికల అనంతరం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరు నచ్చక కాంగ్రెస్‌ను వీడి శనివారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి , బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు పొట్ట అంజి, ఎర్రోల కృష్ణ, నాగయ్య, శంకర్, నాగరాజు తదితరులు చేరారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ సుధాకర్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, వెంకట కిషన్ రావు, నరేందర్‌రెడ్డి , లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం


రామన్నపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యలపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 నిరంతరం పోరాటం నిర్వహిస్తుందని యాదాద్రి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.యాదగిరి, ఎస్.అమర్‌నాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మల్లికార్జున గార్డెన్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ కార్మికుల సమస్యలపై పోరాగే కార్మిక సంఘం కేవలం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమే అన్నారు. సమావేశంలో అనంతరం రామన్నపేట సబ్ డివిజన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైయింది. రామన్నపేట నూతన సబ్ డివిజన్ లీడర్‌గా నల్ల రాములు, వలిగొండ సెక్షన్ లీడర్ గాజుల మహేష్, రామన్నపేట సెక్షన్ లీడర్ ఎండీ చాంద్‌పాషాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఆలే రమేష్, గంగుల సోమేశ్వర్‌రెడ్డి, జిల్లా నాయకులు కునూరు మహేష్‌గౌడ్, సురేష్, యాదయ్య, ఎండీ చాంద్, సత్తిరెడ్డి, వేణు, హర్షత్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటాన్ని ప్రదర్శించాలి

మోత్కూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేసే చోట రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం పెట్టని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ జిల్లా కమిటి సభ్యుడు దాసరి తిరుమలేష్ డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటంతో పాటు అంబేడ్కర్ చిత్ర పటం ఉంచాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా కొందరు పాటించడంలేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని వారిపై చర్య తీసుకోవాలన్నారు. గడ్డం సాయిరాం, దాసరి నరేష్, జిట్టు సాయికుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మాజీ ఎంపీపీ రమేష్‌రాజుకు మాతృ వియోగం

వలిగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకారం గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజుకు మాతృ వియోగం జరిగింది. ఆయన మాతృ మూర్తి నూతి అండాలు (80) శనివారం తెల్లవారుజామున ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆమె అస్వస్థతకు గురికాగా సోమవారం హుటాహుటిన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు ఆమెకు వైద్య సేవలు అందిస్తుండగా హఠాన్మరణం చెందారు. అంత్యక్రియలు కుటుంబసభ్యులు బంధువులు గ్రామస్థుల మధ్య స్వగ్రామంలో జరిగాయి. ఆమె భౌతికగాయంలపై భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ అంత్యక్రియలకు మార్కెట్ కమిటీ చైర్మన్ భీమానాయక్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కంకల కిష్టయ్య నాయకులు బడుగు సత్యనారాయణ, బోళ్ల శ్రీను బాల్‌నర్సింహ, యుగేందర్‌రెడ్డి, గుండు దానయ్య, పలుసం సతీష్, గరిసే రవి, బత్తిని సహదేవ్, చిలుగూరి సత్తిరెడ్డి, బద్దం సంజీవరెడ్డి, ఉలిపే మల్లేశం నాయకులు హాజరయ్యారు.



నూతి అండాలు
(ఫైల్‌ఫోటో)